తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శనివారం
10 అక్టోబర్ 2026
పేజీలు : 08




## మహిళా ఉద్యోగులకు భద్రతపై అవగాహన

గచ్చిబౌలిలోని కేర్లాన్ గ్లోబల్ సొల్యూషన్స్ ఇండియా ఎల్ఎల్‌పీలో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సహకారంతో మహిళా భద్రతపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఇందులో 100 మందికి పైగా మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. షీ టీమ్స్ ఎస్ఐలు అంబిక, రష్మి, ఎస్‌సీఎస్‌సీ ప్రతినిధులు భౌతిక, డిజిటల్ వేదికలపై వ్యక్తిగత భద్రత, ప్రమాదాలను గుర్తించడం, బాధ్యతాయుతమైన డిజిటల్ వినియోగం, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అసురక్షిత పరిస్థితులు ఎదురైనప్పుడు అప్రమత్తంగా ఉండటంతో పాటు తక్షణమే పోలీసుల సహాయం కోరాలని సూచించారు. మహిళల భద్రత, చైతన్యం, సాధికారతను పెంపొందించేందుకు కార్పొరేట్ సంస్థల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

### 2,438 మందికి అవగాహన

మహిళలు, చిన్నారుల రక్షణపై ఏహెచ్‌టీయూ, షీ టీమ్స్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా సుమారు 2,438 మంది పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్యవివాహాలు, బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థ, స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. మహిళా హెల్ప్‌లైన్ 181, బాలల హెల్ప్‌లైన్ 1098, డయల్ 100/112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 సేవల గురించి వివరించారు.

# షీ టీమ్స్ మెరుపు దాడులు

- 101 మాయోపాయ ఆపరేషన్లు..48 కేసుల నమోదు
- 34 ఫిర్యాదుల స్వీకరణ.. 32 కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి

## షీ టీమ్స్ ఆపరేషన్‌లో 55 మంది అరెస్టు

శేరిలింగంపల్లి, అక్టోబర్ 9 (జనంసాక్షి): మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీ టీమ్స్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. అక్టోబర్ 3 నుంచి 8వ తేదీ వరకు చేపట్టిన మాయోపాయ ఆపరేషన్లలో మహిళలను వేధిస్తున్న 55 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు మహిళా, శిశు భద్రతా విభాగం అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఈ ఆపరేషన్లలో 48 చిన్న కేసులు నమోదు చేయగా, బాధితుల నుంచి వివిధ మార్గాల్లో 34 ఫిర్యాదులను స్వీకరించారు.

**ముగ్గురు బాధితులకు విముక్తి**

మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం రెండు పీఐటీఏ కేసుల్లో ముగ్గురు బాధితులను రక్షించి, ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలు, సీడీఈడబ్ల్యు కేంద్రాల ద్వారా కుటుంబ వివాదాల్లో చిక్కుకున్న 32 కుటుంబాలను తిరిగి కలిపేందుకు ప్రయత్నాలు చేపట్టారు.



## ప్లాస్టిక్‌కు చెక్.. స్టీల్ ప్లేట్లే బెస్ట్!

- చేవెళ్లలో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటుకు 8వ తరగతి విద్యార్థిని లక్ష్మీ తేజ వినూత్న ప్రతిపాదన

లోపలి పేజీలో

### దుర్గామాత విగ్రహాల నిర్వాహకులతో జోనల్ స్థాయి సమన్వయ సమావేశం



హైదరాబాద్ (జనంసాక్షి): జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ డివిజన్ల పరిధిలో దుర్గామాత విగ్రహాల ఏర్పాటు నిర్వాహకులతో జోనల్ స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు, డీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవాల

లోపలి పేజీలో




## పేదలకు విద్య, వైద్యం ప్రాధాన్యం

- ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయం ఉండాలి
- దిశ కమిటీ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09 (జనంసాక్షి) : ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

**పేదలకు మెరుగైన వైద్యం అందించాలి**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతను అధిగమించాలని ఈటల రాజేందర్ సూచించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతోపాటు మందులు, లోపలి పేజీలో

# తలకొండపల్లిలో భూ వివాదం

## బీఆర్ఎస్ నేతపై బాధితుడి ఫిర్యాదు

- అక్రమ రిజిస్ట్రేషన్‌తో బెదిరింపులు-ప్రాణహాని ఉందంటూ ఎమ్మార్వోకు వినతి

తలకొండపల్లి అక్టోబర్ 09(జనంసాక్షి): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో భూ వివాదం చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వార్డు సభ్యుడు పుల్లారెడ్డి దశరథం పొజిషన్ లేని మూడు గంటల నర భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని,చంపేస్తానని బెదిరిస్తున్నాడని బాధితుడు అంపటి సత్తయ్య కుటుంబం ఆరోపిస్తోంది.బాధితుడు అంపటి సత్తయ్య తండ్రి నరసింహ తెలిపిన వివరాల ప్రకారం. తలకొండపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 4 లో భూమిని కొనుగోలు చేసి పొజిషన్లో ఉండి గత 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని, ఇదే సర్వే నెంబర్ లో పొజిషన్‌లో లేని భూమిని పుల్లారెడ్డి దశరథం తన అనుచరులతో కలిసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు.తాను పొజిషన్లో ఉన్న భూమిలోకి వచ్చి ఇదే తన భూమి అని బెదిరింపులకు పాల్పడుతున్నాడు.తమ పొలానికి ఉన్న కడీలను కూలగొట్టడంతో పాటు,తమపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారని,ఎక్కువ మాట్లాడితే కుటుంబ సభ్యులపై కూడా కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబం వాపోయింది.గత 5 సంవత్సరాలుగా మానసికంగా వేధిస్తున్నారని,తమ పొలాన్ని లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని,గ్రామ



పెద్దలు కూడా అవతలి వర్గానికే వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సర్వే నంబర్ 4 లోని భూమికి సంబంధించి దాదాపు 20 సార్లు సర్వే చేయించామని,తమకు అనుకూలంగా కోర్టు నుంచి స్టే ఆర్డర్ కూడా తెచ్చుకున్నామని, అయినా కోర్టు ఆర్డర్‌ను, పోలీసులను లెక్క చేయకుండా వ్యవహరిస్తున్నారని బాధితులు పేర్కొన్నారు. తమకు పుల్లారెడ్డి దశరథం కుటుంబం నుంచి ప్రాణహాని ఉందని, తమకు న్యాయం చేయాలని కోరుతూ తలకొండపల్లి తహశీల్దార్ కె.రమేష్ కు వినతిపత్రం అందజేశారు.అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

# అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

## వికారాబాద్ జిల్లాలో 264 పోస్టుల భర్తీ




**యాలాల అక్టోబర్ 9 ( జనంసాక్షి ) :** మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా వికారాబాద్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 264 పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి వెల్లడించారు. ఇందులో 102 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 162 అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఉన్నాయి.జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో కోడంగల్‌లో 13 టీచర్, 31 ఆయా పోస్టులు, మర్పల్లిలో 21 టీచర్, 14 ఆయా పోస్టులు, పరిగిలో 27 టీచర్, 78 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాండూరు ప్రాజెక్టులో 23 టీచర్, 28 ఆయా పోస్టులు, వికారాబాద్ ప్రాజెక్టులో 18 టీచర్, 11 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు.అర్హులైన మహిళా అభ్యర్థులు అక్టోబర్ 10 నుంచి 24వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, వయోపరిమితి, స్థానికత, రిజర్వేషన్లు, ఎంపిక విధానం తదితర వివరాలను అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో దరఖాస్తుతో పాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ ప్రతులను సమర్పించాలి అని అధికారులు సూచించారు.దరఖాస్తు విధానం, ఇతర నిబంధనలపై సందేహాలుంటే సంబంధిత చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారులను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేయాలి

## తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంబాబు



**ముషీరాబాద్, అక్టోబర్ 9 (జనం సాక్షి):** రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, మార్పు వస్తుందనే ఆశతో కాంగ్రెస్‌కు అవకాశం కల్పించిన ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ప్రజలందరూ ఐక్యంగా సంఘటితమై హక్కుల సాధన కోసం పోరాటాలను కొనసాగించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంబాబు పిలుపునిచ్చారు.పోరాటాల ద్వారానే ప్రజల హక్కులను సాధించుకోగలమని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ ప్రజా ఫ్రంట్ 17వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సుందరయ్య పార్కు సమీపంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. భౌగోళిక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికీ సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యం కొనసాగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు వేదికలపై తాను చంద్రబాబు శిష్యుడినని ప్రకటించడం, ఆయన ఆదేశాలను పాటిస్తున్నట్లు వ్యవహరించడం తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వం కొత్త సమస్యలను సృష్టిస్తోందని విమర్శించారు. 22-ఏ నిబంధనను తీసుకొచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆదివాసులకు 1/70 చట్టాన్ని సమర్థంగా అమలు చేయకుండా వారి భూములను లాక్కునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. యువతకు ఉద్యోగ భృతి కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు సకాలంలో అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు బి. ముత్తయ్య జెండా ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు ఉప్పల సోమయ్య, గుండపురి ఎల్లయ్య, శ్రీహరి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధన

## కరస్పాండెంట్ పెరుమాళ్ళ వెంకట్ రెడ్డి



**తాండూరు అక్టోబర్ 9(జనంసాక్షి)**బతుకమ్మ అంటే కేవలం ఒక పండుగ కాదు.. అది ప్రకృతిని, పూలను, నీటిని ప్రేమించే మన జీవన విధానమని పెరుమాళ్ళ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పెరుమాళ్ళ వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణం శివాజీ చౌక్ లోని శ్రీ సాయి మేధ విద్యాలయం బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా ఆడి పాడారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను చేసి సంప్రదాయ దుస్తులను ధరించి బతుకమ్మ పాటలకు చిందులు వేశారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పెరుమాళ్ళ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధన అన్నారు. భాద్రపద అమావాస్య నుంచి తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా ఈ వేడుకను జరుపుకుంటామని తెలిపారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి తీరొక్క పూలతో గౌరమ్మను పేర్చి ఎంతో భక్తిశ్రద్ధలతో పూలనే దైవంగా భావించి పూజించే అపురూపమైన సంప్రదాయం మన తెలంగాణ సొంతమని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మనలో ఐక్యతను, సంతోషాన్ని పంచుతుందన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యతను మనకు గుర్తు చేస్తుందని తెలిపారు.తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిన మన బతుకమ్మ పండుగను మనం తరతరాలుగా ఇలాగే బాధ్యతతో కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలు




**మర్పల్లి అక్టోబర్ 09 (జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ మర్పల్లి కళా నందు శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో శాంతమ్మ విద్యార్థులకు తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. బతుకమ్మ సంబరాలలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసామని ప్రధానోపాధ్యాయులు అంజయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పండగల విశిష్టత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పద్మ, ఏ ఏ పీసీ చైర్మన్ శ్యామలమ్మ, ఉపాధ్యాయులు నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మోడల్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు



**చేవెళ్ల, అక్టోబర్ 09 (జనంసాక్షి)** చేవెళ్ల తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ కళాశాలలో బతుకమ్మ పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బతుకమ్మ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, ఎంఈఓ పురందాస్ హాజరయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా బతుకమ్మలను అలంకరించి పోటీల్లో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ పండుగ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అజ్రానా బేగం, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, తాళ్ళపల్లి నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## ప్రజా సంక్షేమ పథకాలు అర్హులకు దక్కాలంటే స్మార్ట్ రేషన్ కార్డు తప్పనిసరి

### సయ్యద్ అలీపూర్ గ్రామ సర్పంచ్ ఉద్దాల లలిత జైపాల్



**మోమిన్ పేట అక్టోబర్ 9 ( జనం సాక్షి)**తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా పాలన ప్రభుత్వంలో పంపిణీ చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు అందాలంటే స్మార్ట్ కార్డు తప్పనిసరి అని సయ్యద్ అలీపూర్ గ్రామ సర్పంచ్ ఉద్దాల లలితా జైపాల్ పేర్కొన్నారు శుక్రవారం మోమిన్ పేట మండల పరిధిలోని సయ్యద్ అలీపూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నాయకత్వంలో తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులందరికీ సన్న బియ్యం వంటి పథకాలు అమలుపరుస్తున్న ఘనత ప్రజాపాలన ప్రభుత్వానికే దక్కిందన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సురేష్ బాల్రాజ్, జీపిఓ నరసింహారెడ్డి, అనంతరెడ్డి, వార్డు సభ్యుడు రాజు, డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, రేషన్ డీలర్ వెంకటయ్య, విట్టల్ రెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు

## బతుకమ్మ తెలంగాణ సాంస్కృతికి ప్రతీక



**శంషాబాద్,అక్టోబర్9(జనంసాక్షి)**బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఏబీవీపి నేషనల్ కళామంచ్ కో-కన్వీనర్ మణికంఠపేర్కొన్నారు. ఏబీవీపి శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని అన్నారు బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఏబీవీపి రాష్ట్ర మహిళా కో-కన్వీనర్ మేఘన, జిల్లా కన్వీనర్ పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ జశ్వంత్, ఎస్ఎఫ్డి కన్వీనర్ నికేతన్, కళామంచ్ కన్వీనర్ రాజకుమారి, నగర సంయుక్త కార్యదర్శులు తరుణ్, వెంకట్, కళాశాల అధ్యక్ష కార్యదర్శులు సర్వజిత్, మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పించాలి

### అధికారులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ఆదేశాలు



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 09 (జనం సాక్షి) :** జిల్లాలో వెట్టి చాకిరీ నిర్మూలనపై ప్రత్యేక అవగాహ న కార్యక్రమాలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా సంబంధిత అధికారు లను ఆదేశించారు. శుక్రవారం లక్డీకాపూల్‌లోని జిల్లా కలెక్టరేట్‌లో 'స్వేచ్ఛా రథం' అవగాహన ప్రచా ర వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. వెట్టి చాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పిం చడం,టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343 ను విస్తృతంగా ప్రచారం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భం గా వెట్టి చాకిరీ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. బోరబండ, యూసుఫ్‌నగర్ లేబర్ అడ్డాలతో పాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఎంజీబీఎస్, సీబీఎస్ బస్టాండ్ల వద్ద పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమా లు నిర్వహించాలని ఆదేశించారు.కార్మికుల దోపిడీ ని అరికట్టడం, వారి హక్కులను పరిరక్షించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అప్పులు, ముందస్తు చెల్లింపులు, బెదిరింపులు, బలవంతం, వేతనాల నిలిపివేత వంటి మార్గాల ద్వారా వ్యక్తులను ఇష్టానికి విరుద్ధంగా పనిచేయించడం వెట్టి చాకిరీ కిందకు వస్తుందని వివరించారు. అవగాహన లేకపోవడం, ప్రతీకార చర్యల భయం కారణంగా బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడే అవకాశం ఉన్నందున ప్రజల్లో అవగాహన పెంచా లని సూచించారు. వెట్టి చాకిరీకి సంబంధించిన అనుమానాస్పద ఘటనలు గుర్తించినట్లయితే వెంటనే 080-69434343 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశా రు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, ఏవో వెంకట్రామిరెడ్డి, డీపీఆర్వో హబీబ్ మొహమ్మద్, జిల్లా అధికారులు, ఐజేఎం సభ్యులు, కళాబృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌యూబీ పనులు త్వరగా పూర్తి చేయాలి

### : ఎమ్మెల్యే మర్రి



**అల్వాల్, అక్టోబరు 9 (జనంసాక్షి ):**జనప్రియ వద్ద చేపట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శు క్రవారం ఆయన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానికుల రాకపోకల ఇబ్బందులు తొలగించేందుకు సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఈ ఆర్‌యూబీ పనులు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణం పూర్తయితే ఈ మార్గంలో ప్రయాణ కష్టాలు శాశ్వతంగా తీరుతాయని, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, పవన్, నర్ల సురేష్, మధుసూదన్‌రెడ్డి, రాజు, సులోచన, హరిత తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ దుర్వాసన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**హయత్ నగర్, అక్టోబర్ 9 (జనం సాక్షి)**ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని కాలనీవాసులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి వెంకట నరసయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల్లోని దాదాపు 20 కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న దుర్వాసన, కాలుష్య సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యర్థ పదార్థాలు, జంతు కళేబరాలు, మురుగునీటి కారణంగా పరిసర ప్రాంతాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో దుర్వాసన మరింత తీవ్రంగా ఉంటోందని, దీంతో వృద్ధులు శ్వాసకోశ సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో సుమారు రూ.6 కోట్లతో స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. డంపింగ్ యార్డ్‌లోకి వివిధ ప్రాంతాల నుంచి ట్యాంకర్ల ద్వారా వ్యర్థ రసాయనాలను తీసుకొొచ్చి వదులుతున్నట్లు తన దృష్టికి రావడంతో అప్పటి అధికారులతో మాట్లాడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అక్రమంగా చెత్తను తరలించి వేస్తున్న లారీలను గుర్తించి భారీ జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. గతంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, అటవీ శాఖ, హైలా తదితర సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి అక్కడ నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించేందుకు ట్యాంకర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జంతు కళేబరాలు, ఇతర వ్యర్థ పదార్థాలను పడేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మురుగునీటిని తరలించేందుకు మోటార్లు ఏర్పాటు చేయడంతో పాటు, ఆ ప్రాంతంలో పర్యవేక్షణ కోసం వాచ్‌మెన్‌ను నియమించినట్లు చెప్పారు. అలాగే ఎస్టీపీ ప్లాంట్ల నిర్మాణం కూడా చేపట్టినట్లు గుర్తుచేశారు.ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతంలోని కెమికల్, ఫర్టిలైజర్ గోదాములు, మెకానికల్ షెడ్లను తనిఖీ చేసి, డ్రైనేజీ లైన్ల ద్వారా వ్యర్థాలు, రసాయనాలను విడుదల చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారానికి సంబంధించిన సుమారు 90 శాతం పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ సమస్యపై కొందరు వాస్తవాలు తెలుసుకోకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని విమర్శలు చేయడం సరికాదని ఆయన అన్నారు. అయినప్పటికీ, రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్ పరిసర కాలనీలకు దుర్వాసన నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, జక్కిడి రఘువీర్ రెడ్డి, సంతోష్ గుప్తా, రవి, బాలరాజుతో పాటు డంపింగ్ యార్డ్ ప్రభావిత కాలనీల అధ్యక్షులు అంజయ్య గౌడ్, గోపికృష్ణ రెడ్డి, రమేష్, రవి, విజయ, ప్రభాకర్, సాంబిరెడ్డి, రాజేష్, రంగారెడ్డి, వాసు యాదవ్, గాలయ్య, భాస్కర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఋతు మార్పుల్లో దంతాల సున్నితత్వంపై అవగాహన అవసరం



**ఖైరతాబాద్, అక్టోబర్ 09 (జనం సాక్షి) :** ఋతు మార్పుల సమయంలో వేడి, చల్లని పానీయాల వల్ల దంతాల సున్నితత్వం పెరిగే అవకాశం ఉందని పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా(ఎండిఎస్, పిహెచ్డి) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దంతాల సున్నితత్వంపై డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. దంతాలు, చిగుళ్ల ఆరోగ్యానికి రోజువారీ నోటి సంరక్షణకు లవంగం, అల్లం వంటి ఆయుర్వేద పదార్థాలుగల ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడిఎ) ఆమోదం పొందిన డాబర్ రెడ్ టూత్‌పేస్ట్ ఉపయోగ పడుతుందని తెలిపారు.

# కాన్షీరాం ఆశయ సాధనకు కృషి

### డీఎస్పీ మండల అధ్యక్షుడు మహిపాల్




**కేశంపేట, అక్టోబర్ 9( జనం సాక్షి) :** మాన్యశ్రీ కాన్షిరాం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు మహిపాల్ మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కాన్షిరాం వర్ధంతిని నిర్వహించారు. కాన్షిరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిపాల్ మహారాజ్ మాట్లాడుతూ.. కాన్షీరామ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. డీఎస్పీ పార్టీ అధినేత విశారదన్ మహారాజ్ సారథ్యంలో రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం తెచ్చి కాన్షీరామ్ కు అంకితమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రమేష్ గౌడ్, మల్లేష్ మహారాజ్, కృష్ణ, ఆనంద్, నరేష్, పురుషోత్తం, కృష్ణ, రమేష్, భాస్కర్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో జేఏసీ కూటమి అభ్యర్థుల గెలుపు తథ్యం

### సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్



**హయత్‌నగర్, అక్టోబర్ 9 (జనం సాక్షి )**టీజీఎస్‌ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో జేఏసీ కూటమి అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని సీపీఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు పబ్బతి లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.టీజీఎస్‌ఆర్టీసీలో జరుగుతున్న గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో హయత్‌నగర్-1, హయత్‌నగర్-2 డిపోల పరిధిలో టీజీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్, జేఏసీ కూటమి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కార్మికులను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సామిడి శేఖర్ రెడ్డి, పబ్బతి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న జేఏసీ కూటమి అభ్యర్థులను కార్మికులు భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘం ఎన్నికల్లో క్లాజ్-3 కింద కేటాయించిన 'బస్సు' గుర్తుకు, స్థానిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో క్లాజ్-6 కింద కేటాయించిన 'నిచ్చెన' గుర్తుకు తమ అమూల్యమైన ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం జేఏసీ కూటమి నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు తన ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని కోరారు. కార్మికుల మద్దతుతో జేఏసీ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే నమ్మకం తమకు ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ హయత్‌నగర్ మండల కన్వీనర్ అంబల రాములు, ఏఐటీయూసీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అమనగంటి వెంకన్న, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎం. చంద్రయ్య, డి. వెంకటేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి శాగంటి వీరన్నతో పాటు పలువురు నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# భూ సర్వే ను పారదర్శకంగా నిర్వహించాలి

### ఆర్డీవో సరిత



**కేశంపేట, అక్టోబర్ 9 (జనం సాక్షి ) :** భూ రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీవో సరిత అన్నారు. మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే పనులను శుక్రవారం ఆర్డీవో సరిత పరిశీలించారు. సర్వే పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సర్వే నెంబర్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమక్షంలో హద్దులను నిర్ణయించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, నాయకులు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 23వ రోజుకు చేరిన ఉద్యమకారుల రిలే నిరాహార దీక్షలు



**అల్వాల్, అక్టోబరు 9 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 23వ రోజుకు చేరాయి. ప్రభుత్వం హామీలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ఉద్యమకారుల సంఘం నాయకులు స్పష్టం చేశారు.దీక్షా శిబిరంలో పి. ముత్యాలు, శ్యామ్‌కుమార్, రషీద్ కూర్చున్నారు. శిబిరాన్ని పటోళ్ల సురేందర్‌రెడ్డి, పుట్నాల కృష్ణ, దయాకర్, మంద శోభన్, అనంతుల సంతోష్, డోలి సుధీర్, శేరుపల్లి మల్లేష్, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, సంగమేశ్వర్, రమేష్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి హామీల అమలుకు చర్యలు చేపట్టాలని, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కేశంపేట్, అక్టోబర్ 9 (జనం సాక్షి ) :** మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగు రంగు పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలకమని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.అనంతరం అందంగా బతుకమ్మలను రూపొందించిన విద్యార్థులకు ఉప సర్పంచ్ సపురా అమీర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్క మల్లయ్య,వార్డు సభ్యులు చంద్రయ్య, రిజ్వాన బేగం, మోహిజ్, కాంగ్రెస్ యువ నాయకుడు రాజేందర్ నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు ఖాజా, మల్లేష్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్రులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

**అంబర్పేట్ సెప్టెంబర్ 9 (జనం సాక్షి )**గంగ పుత్రులు, బెస్త ,గుండ్ల తో పాటు మొత్తం 68 కులాలు బిసి ఏ గ్రూపులో ఉన్నారు వీరందరికీ ఏడు శాతం రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. వీరి విద్య సామాజిక ఆర్థిక మరియు రాజకీయ రంగాలలో చాలా వెనుకబడి ఉన్నారు వీరందరూ సంచార జాతులు మరియు అర్ధసంచార జాతులు వృత్తి కులాలు వీరి జీవన విధానం దయానియా స్థితిలో ఉన్నది. వీరిని ఎస్టి జాబితాలో చేర్చాలని దీటి మల్లయ్య తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు,ముఖ్యమంత్రి ని కోరడం జరిగింది. ఇటీవల ముదిరాజ్ కులం వారిని బీసీ ఏ లో చేర్చాలని కోరారు. బి సి డి గ్రూప్ వారికి కూడా రిజర్వేషన్ సౌకర్యం ఉంది. వీరి విద్య సామాజిక ఆర్థిక మరియు రాజకీయ రంగాల్లో చాలా అభివృద్ధి చెంది ఉన్నారు. వీరికి కేటాయించిన రిజర్వేషన్ సౌకర్యం కాదని వీరిని బిసి ఏ గ్రూపులోకి చేర్చితే బీసీఏ గ్రూపులో రిజర్వేషన్ పూర్తిగా ముదిరాజుల కబ్జా చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అట్టడుగు కులాల వారికి అన్యాయం చేయవద్దని ముదిరాజులను బిసి ఏ లో చేర్చితే ,బీసీ ఏ వాళ్లని ఎస్టీ జాబితాలో చేర్చాలని మనవి చేశారు. ఈ మార్చే అంశము కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంది కాబట్టి, కేంద్ర మంత్రులు వచ్చే పార్లమెంట్ సమావేశాలలో చర్చించి బిసి ఏ వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని బిల్లు ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వ నాయకత్వాన్ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో శీలం రాజ్ కుమార్, పాక మధుసూదన్, దేవేందర్, కొండ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# దుష్ప్రచారాలు మానుకోవాలి

### యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్

**యాచారం, అక్టోబర్ 09 (జనం సాక్షి ):** ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సులో ప్రయాణిస్తూ ప్రజలతో మాట్లాడిన దృశ్యాలను కొంతమంది వక్రీకరించి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని యాచారం మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ ఆరోపించారు.అక్టోబర్ 6న కలెక్టరేట్ కార్యక్రమం అనంతరం బొంగ్లూర్ గేటు వద్ద ప్రయాణికుల కష్టసుఖాలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ఆర్టీసీ బస్సులో ప్రయాణించారని తెలిపారు. బస్సులో తన కూతురు తో సమానం గల యువతితో మాట్లాడిన దృశ్యాలను వక్రీకరించి ట్రోలింగ్ చేయడం సరికాదన్నారు. రాజకీయ విమర్శలకు అంశాలు లేకపోవడంతోనే ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను మానుకోవాలని గజ్జి రామకృష్ణ యాదవ్ హెచ్చరించారు..మీరు ఏదైనా అభివృద్ధి గురించి మాట్లాడాలి ప్రజలకు ఉపయోగం జరిగేలా మాట్లాడాలి అంతే గాని ఏలాంటి మచ్చలేని మా నాయకుని పైన దురుప్రచారం చేస్తే ఊరుకునేది లేదు నియోజకవర్గం లో కూడా తిరుగకుండా ప్రజలే మీకు బుద్ధి చెప్తారు అని గజ్జి రామకృష్ణ యాదవ్ టిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు



# యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఘన స్వాగతం

### వేమారెడ్డి నాయకత్వంలో ఘన స్వాగతం పలికిన మోమిన్ పేట మండల కాంగ్రెస్ నాయకులు

**మోమిన్ పేట అక్టోబర్ 9 ( జనం సాక్షి)** యూరప్ పర్యటనలో భాగంగా కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) కార్యక్రమాల్లో పాల్గొని, పర్యటనను విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు హృదయపూర్వక స్వాగతం పలుకుతూ, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేమారెడ్డి నాయకత్వంలో పలువురు నాయకులు శాలువా పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ రాష్ట్ర శాసన వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తూ సీపీఏ కార్యక్రమాల్లో పాల్గొనడం రాష్ట్రానికి గర్వకారణమని కౌన్సిలర్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, శాసన వ్యవస్థ ప్రాధాన్యతను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పే కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. పర్యటనను విజయవంతంగా ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వస్తున్న శాసనసభాపతికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా ఆయన చేపట్టే కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని కొని ఆడారు దళిత ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు కే సురేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బందెయ్య, రాజు బాబు, సామెల్ వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్లు మాజీ ఎంపిటిసి సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు




# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే ట్రాఫిక్ కొనసాగింపు

### రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### రూ.1,090 కోట్లతో 4.3 కి.మీ. స్టీల్ ఎలివేటెడ్ కారిడార్

### అధికారులతో కలసి అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 09 (జనం సాక్షి) :** కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమ స్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జూబ్లీహి ల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు సమగ్ర ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరా బాద్ జిల్లా ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రూ.1,090 కోట్లతో రెండు ప్యాకేజీలుగా ఆరు వరు సల స్టీల్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడిం చారు. శుక్రవారం కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వి.కర్ణన్, అదనపు కమిషనర్ సంతోష్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. పునా ది తవ్వకాలు, జంక్షన్ల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం అమలవుతున్న వన్‌వే ట్రాఫిక్ విధానం విజయవం తమైన నేపథ్యంలో గతంలో ప్రతిపాదించిన వేర్వే రు అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణ ప్రతిపా దనలను ఉపసంహరించినట్లు అధికారులు వివ రించారు. ప్రస్తుతం అమలులో ఉన్న వన్‌వే విధా నం కొనసాగుతుందని తెలిపారు. ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ నుంచి కేబీఆర్ పార్క్ ప్రవేశ ద్వారం వరకు అధికంగా ఉన్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సమగ్ర ఎలివేటెడ్ కారిడార్ ప్రణాళికను రూపొందించారు. 4.3 కిలోమీటర్ల పొడవుతో





నిర్మించనున్న ఈ కారి డార్ ద్వారా ఐదు ప్రధాన జంక్షన్లలో సిగ్నల్ రహిత రాకపోకలకు అవకాశం కలగనుంది.రెండు ప్యాకేజీలుగా నిర్మాణం...ఈ ప్రాజెక్టును ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. మొదటి ప్యాకేజీలో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధా జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. దీనికి రూ.580 కోట్లు కేటాయించారు. రెండో ప్యాకేజీలో ముగ్ధా జంక్షన్ నుంచి ముఫఖం జా కాలేజీ వరకు స్టీల్ ఫ్లైఓవర్‌తో పాటు బంజారాహిల్స్ రోడ్ నంబర్-1కు అనుసంధానంగా ప్రత్యేక ర్యాంపును నిర్మించనున్నారు. ఈ ప్యాకేజీకి రూ.510 కోట్లు కేటాయించారు. ఆధునిక మాడ్యులర్ స్టీల్ నిర్మాణ సాంకేతికతను వినియోగించడం ద్వారా పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నిర్మాణ సమయంలో వాహనదారులకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. కేబీఆర్ పార్క్ పర్యావరణ సున్నిత ప్రాంతంలోకి విస్తరించకుండా, ప్రస్తుతం ఉన్న పచ్చదనంపై ప్రభావం కనిష్ఠంగా ఉండేలా కారిడార్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు.రూ.1,200 కోట్ల ఆదాకు అంచనా..గతంలో ప్రతిపాదించిన అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణంతో పోలిస్తే కొత్త ప్రణాళిక ద్వారా భూసేకరణ, నిర్మాణ మార్పుల అవసరాలు తగ్గుతాయని అధికారులు వివరించారు. అధిక విలువ కలిగిన ప్రైవేటు భూముల సేకరణ అవసరం తగ్గడం వల్ల సుమారు రూ.800 కోట్లు, నిర్మాణ వ్యయంలో మరో రూ.400 కోట్లు ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. మొత్తంగా రూ.1,200 కోట్ల మేర ప్రజాధనం ఆదా కావచ్చని తెలిపారు. కారిడార్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం ఆదా అవుతుందని, వాహనాల బారులు తగ్గి ఇంధన వినియోగం కూడా తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టు అలైన్‌మెంట్, పనుల పురోగతి, పచ్చదనానికి కలిగే ప్రభావాన్ని తగ్గించే చర్యలపై మంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు.

# ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ,ముదిరాజ్ బస్తీలో కోతుల బీభత్సం

## ఇళ్లలోకి చొరబడుతున్న వైనం



**రంగారెడ్డి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ముదిరాజ్ బస్తీలో కోతుల సంచారం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ స్థానిక ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. బస్తీలో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం వీధుల్లో తిరగడమే కాకుండా, నేరుగా ఇళ్లలోకి చొరబడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వంటగదిలోకి ప్రవేశించి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఇళ్లపై ఉంచిన బట్టలను చింపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు వెళ్లాలన్నా, ఇళ్ల తలుపులు తెరిచి ఉంచాలన్నా ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఎవరైనా అడ్డుకోబోతే వారిపైకి దాడికి యత్నిస్తుండటంతో బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటి వరకు అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన కరువైందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి, తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని.. బస్తీలో కోతుల బెడదను నివారించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముదిరాజ్ బస్తీ ప్రజలు కోరుతున్నారు.

# హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబురాలు



**హయత్ నగర్, అక్టోబర్ 9 (జనం సాక్షి)** హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. కళాశాల ప్రాంగణం పూల సోయగాలు, బతుకమ్మ పాటలు, విద్యార్థినుల ఆటపాటలతో పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు కొబ్బరికాయ కొట్టి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు భక్తిశ్రద్ధలతో గౌరీ పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాల తర్వాత సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. ఆకుపచ్చని వస్త్రధారణలో మహిళా అధ్యాపకుల సందడి ఈ వేడుకల్లో కళాశాల మహిళా అధ్యాపకులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆకుపచ్చని వస్త్రధారణతో (గ్రీన్ డ్రెస్ కోడ్) హాజరైన వారు విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిపాడుతూ సంబురాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యాపకులు, విద్యార్థినుల సమష్టి భాగస్వామ్యంతో వేడుకలు మరింత కళకళలాడాయి. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను కళాశాలలో ఇంత ఘనంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అధ్యాపకులు, విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణంతో నిండిపోయింది. బతుకమ్మల పోటీలో విజేతలకు బహుమతులు విద్యార్థినులు నైపుణ్యంతో, సృజనాత్మకంగా పేర్చిన బతుకమ్మల్లో అత్యుత్తమమైన వాటిని న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. పోటీలో ఎన్‌సీసీ బతుకమ్మ మొదటి బహుమతి సాధించగా, బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థినులు రెండో బహుమతి, బీకాం తృతీయ సంవత్సరం విద్యార్థినులు మూడో బహుమతి గెలుచుకున్నారు. బీఏ మొదటి సంవత్సరం విద్యార్థినులకు కన్సొలేషన్ బహుమతి లభించింది. ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సురేష్ బాబు, వైస్ ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్ రెడ్డి, ఇందిరా, బతుకమ్మ వేడుకల సమన్వయకర్త అనిత, అపర్ణ చతుర్వేది, నాగేంద్ర, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, గీతా నాయక్, పి. రమాదేవి, శారదా దేవి, డి. రమాదేవి, జయలక్ష్మి తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# మల్కాజిగిరి డిగ్రీ విద్యార్థులకు అమెరికా ఎన్ఆర్ఐల చేయూత

## 73 మందికి 4.10 లక్షల ఉపకార వేతనాలు

### ప్రిన్సిపల్ చొరవతో సిద్ధివినాయకా అసోసియేషన్ తోడ్పాటు




**మల్కాజిగిరి అక్టోబర్ 9 (జనం సాక్షి)** ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి కూడా ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న సంకల్పంతో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యం ప్రత్యేక చొరవ చూపింది. అమెరికాలో స్థిరపడిన తెలుగు ప్రవాస భారతీయులు సిద్ధివినాయకా అసోసియేషన్ ద్వారా ముందుకొచ్చి కళాశాల విద్యార్థులకు భారీ ఆర్థిక చేయూతను అందించారు. సింగిల్ పేరెంట్ కుటుంబాలకు చెందిన 73 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు 4,10,400 విలువైన ఉపకార వేతనాలను పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య బండి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది కళాశాలలోని 46 మంది విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందగా, ప్రిన్సిపల్ ప్రత్యేక కృషితో ఈ ఏడాది ఆ సంఖ్య 73కు పెరిగింది. వరుసగా రెండో ఏడాది కూడా ఎన్ఆర్ఐలు తోడ్పాటు అందించడంపై విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యాభ్యాసానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న సిద్ధివినాయకా అసోసియేషన్ ప్రతినిధి సాయికిరణ్‌తో పాటు సహకారం అందించిన చైతన్య రెడ్డి, పూర్ణచందర్ రెడ్డిలకు ప్రిన్సిపల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక తోడ్పాటు నిరుపేద విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు తలసానికి ఆహ్వానం



**అమీర్‌పేట్ (జనం సాక్షి):** ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పలు ఆలయాల నిర్వాహకులు ఆహ్వానం అందజేశారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బల్కంపేట ఎల్లమ్మ ఆలయ అధికారులు, పండితులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికతో పాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈఓ వినోద్ రెడ్డి, సూపరింటెండెంట్ నాగరాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, కట్టా బలరాం, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అమీర్‌పేట్‌లోని హనుమాన్ దేవాలయంలో నిర్వహించనున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ ఈఓ జయంతి, చైర్మన్ సత్యనారాయణ యాదవ్ తదితరులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వానం అందజేశారు.

# బతుకమ్మ వేడుకల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి



**ఎల్బీనగర్ అక్టోబర్ 9 (జనం సాక్షి)** బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి చైతన్యపురి డివిజన్‌లోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టైలరింగ్, బ్యూటీషియన్, మెహందీ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే కార్యక్రమం విజయవంతం కావడంతోనూ కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకురాలు శోభారాణి, సీనియర్ నాయకుడు సంతోష్ యాదవ్, అర్చన, శివబిందు తదితరులు, డివిజన్ మహిళలు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలి



**రాజేంద్రనగర్,అక్టోబర్9(జనంసాక్షి)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్షాకోట్, బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్ డివిజన్లలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజ్ మాట్లాడుతూ, కనీసం రెండు రోజులకు ఒకసారైనా క్రమం తప్పకుండా నీటి సరఫరా చేయాలని కోరారు. పైపులైన్లు, మోటార్ల మరమ్మతులు చేపట్టి, నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను వినియోగంలోకి తీసుకురావాలని ప్రధాన కార్యదర్శి వి. రాములు యాదవ్ సూచించారు. దీనిపై స్పందించిన ఎండీ త్వరలో కాలనీల్లో తనిఖీలు నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతి కుమార్, చందు మల్లుల పాల్గొన్నారు.

# లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

## ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన తండావాసులు



**కేశంపేట అక్టోబర్ 9 (జనం సాక్షి) :** మండల పరిధిలోని దేవుని గుడి తండా గ్రామ పంచాయతీలో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. తాండాలో ప్రజలు చాలా రోజులుగా వోల్టేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నదాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ వి. సుజాత హనుమంతు నాయక్ సమస్యను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తండాలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ని ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అధికారులు తండాలో ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు తండావాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డు సభ్యులు దేవి, దాస్య, లక్ష్మీ దశరథ్, బుజ్జి జయరాం, రుక్మిణి, నాయకులు రాము, బద్రు, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎన్ఎస్ యు ఐ అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్ ఎంపిక



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 9( జనం సాక్షి)**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, చింతల్ డివిజన్‌కు చెందిన ఎం. రాకేష్ ముదిరాజ్ మేడ్చల్-- మల్కాజ్‌గిరి జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా కొలను హనుమంత రెడ్డి ముఖేష్ ముదిరాజ్ కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.అనంతరం నియామక పత్రాన్ని హన్మంత్ రెడ్డి చేతుల మీదగా అందజేశారు .ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఎం. రాకేష్ ముదిరాజ్‌కు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని, ఎన్ఎస్ యుఐ సంస్థను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి, ప్రజలకు విద్యార్థులకు సేవలందిస్తూ, రాజకీయంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## నేడు బోడుప్పల్ లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**బోడుప్పల్-జనంసాక్షి::**నేడు చిలుకానగర్ విద్యుత్ డివిజన్ సరస్వతి కాలనీ ఫీడర్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు చిల్కానగర్ విద్యుత్ శాఖ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు.సరస్వతి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12గంటల నుంచి 1గంటల వరకుశ్రీనగర్ కాలనీ,సరస్వతి కాలనీ, విజయపురి కాలనీ,సాయిరాం నగర్,ఉదయ్ నగర్,అశోక్ నగర్, ప్రశాంత్ నగర్ వరకు ప్రధాన రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందనివినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి కోరారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### పట్టుదల, క్రమశిక్షణతోనే విజయాలు సాధ్యం

### డిప్యూటీ కలెక్టర్ చంద్ర కిరణ్



**కోట్ పల్లి, అక్టోబర్ 09 (జనంసాక్షి):** విద్యార్థులు మహనీయులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదల, క్రమశిక్షణతో విజయాలు సాధించాలని డిప్యూటీ కలెక్టర్ పెండ్యాల చంద్ర కిరణ్ సూచించారు. శుక్రవారం మండల విద్యాధికారి చంద్రప్పతో కలిసి కోట్ పల్లి కేజీబీవీని సందర్శించి విద్యార్థుల విద్యా ప్రగతి, వసతి, భోజనం, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోట్ పల్లి మండల విద్యాధికారి చంద్రప్ప, కేజీబీవీ ప్రత్యేక అధికారి పల్లవి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పల్లవి కిడ్జ్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**చేవెళ్ల, అక్టోబర్ 09 (జనంసాక్షి)** చేవెళ్లలోని పల్లవి కిడ్జ్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, డైరెక్టర్లు క్రాంతి, అంజి, ప్రిన్సిపాల్ భరీరా కాతున్ చిన్నారులను అభినందించారు. ఉపాధ్యాయులు సైతం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల చిరునవ్వులు, బతుకమ్మ పాటలు, సంప్రదాయాల సందడితో పల్లవి కిడ్జ్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా ముగిశాయి.

## బతుకమ్మ సంబరాలలో విద్యార్థులకు యూనిఫామ్స్, సాక్సుల పంపిణీ చేసిన జైపాల్ రెడ్డి



**శామీర్ పేట్, అక్టోబర్ 9(జనం సాక్షి )**శామీర్‌పేట్ డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బాలేష్, కళ్యాణి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా విద్యార్థులకు యూనిఫామ్స్, సాక్సుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ కట్ట మీనా కుమారి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్, సాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడు తూ.. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని, కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం బతుకమ్మ సంబరాల సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ కార్యక్రమాల్లో పూలను ఉపయోగిస్తారని, అయితే తెలంగాణ రాష్ట్రంలో గునుగు పువ్వుతో పాటు తీరొక్క పూలను సేకరించి బతుకమ్మను పేర్చి, గౌరమ్మను కొలుస్తూ ఆటపాటలతో సంబరాలు నిర్వహించే గొప్ప సాంప్రదాయం మనదని భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, నానిగళ్ళ హరిగోపాల్, మిరియాల సాయి కుమార్, సుతారిగూడెం దుర్గయ్య, కత్తి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయం చేయొద్దు డా.వైభవ్ రెడ్డి



**చేవెళ్ల, అక్టోబర్ 09 (జనంసాక్షి)** ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయ కోణంలో చూడకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు చేపట్టే ప్రక్రియగా భావించాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.వైభవ్ రెడ్డి అన్నారు. శుక్రవారం చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో పారదర్శకత ఉండేలా నకిలీ ఓట్లు, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో నమోదైన ఓట్లను గుర్తించి సరిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండాలనే ప్రజాస్వామ్య సూత్రాన్ని కచ్చితంగా అమలు చేయాలని ఆయన అన్నారు. ఓటర్ల పేర్లు తొలగించారంటూ ఆరోపణలు చేస్తున్న రాజకీయ పార్టీలు నిర్దిష్ట ఆధారాలతో తమ అభ్యంతరాలను వెల్లడించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతోపాటు, అనర్హమైన నమోదులకు అవకాశం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితా నుంచి తమ పేరు తొలగిపోయిందని భావించే అర్హులైన పౌరులు సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించి, అవసరమైన గుర్తింపు పత్రాలతో ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తొలగించిన ఓట్లన్నింటినీ తిరిగి చేర్చాలనే డిమాండ్ల వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశ పౌరులకే అర్హతలకు అనుగుణంగా ఓటు హక్కు వర్తిస్తుందని, విదేశీయులు లేదా అర్హతలేని వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలో ఉండకూడదని డా. వైభవ్ రెడ్డి పేర్కొన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు.. అర్హుడైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అనే సూత్రంతో ఓటరు జాబితా ప్రక్షాళన పారదర్శకంగా సాగాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## డ్రైనేజీకి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

### హైడ్రాతో సమన్వయం చేసుకుని పనులు వేగవంతం చేయాలి

### అధికారులకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాలు



**బోడుప్పల్-జనంసాక్షి::**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ ప్రత్యేక దృష్టి సారించారు.ఇందులో భాగంగా ఉప్పల్ పరిధిలోని చిల్కానగర్,మల్లికార్జున్ నగర్ ప్రాంతాల్లో పర్యటించి వర్షపు నీటి పారుదల సమస్యతో పాటు ప్రతిపాదిత రహదారి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అవుట్‌లెట్ సమస్యపై కమిషనర్ సమీక్షించారు.ప్రస్తుతం వర్షపు నీరు ప్రైవేట్ స్థలం గుండా ప్రవహించి నాచారం చెరువు అవుట్‌లెట్ నాలాలో కలుస్తున్న నేపథ్యంలో నీటి ప్రవాహ మార్గాన్ని సమగ్రంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం,కాలనీలు ముంపునకు గురికావడం వంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కార మార్గాలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.రహదారి అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టివరంగల్ జాతీయ రహదారి నుంచి నల్ల చెరువు మీదుగా మల్లికార్జున్ నగర్ వరకు ప్రతిపాదించిన రహదారి అభివృద్ధి పనుల పురోగతిపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు.ఈ పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి,హైడ్రా అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రహదారి అభివృద్ధి పనులు ముందుకు సాగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అదికారులు పాల్గొన్నారు.

## డ, ఎస్సీ కుటుంబాల సాంఘిక బహిష్కరణ దారుణం

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ముషీరాబాద్ అక్టోబర్ 9 (జనం సాక్షి):** నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో 39 గౌడ కుటుంబాలు, 11 ఎస్సీ కుటుంబాలను గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సాంఘిక బహిష్కరణకు గురిచేయడం దుర్మార్గమని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పేర్కొన్నారు. ఈ ఘటన జరిగి 17 రోజులు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు న్యాయం జరగకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వీడీసీ సభ్యులపై నమోదైన ఏడు కేసులను ఉపసంహరించుకోవాలని, అదేవిధంగా రూ.6 లక్షలు చెల్లించాలని బాధిత కుటుంబాలను బెదిరిస్తూ, లేకుంటే సాంఘిక బహిష్కరణ కొనసాగిస్తామని హెచ్చరించడం దారుణమని జాన్ వెస్లీ విమర్శించారు. బహిష్కరణకు గురైన కుటుంబాలతో గ్రామస్తులు మాట్లాడకూడదని, కిరాణా దుకాణాల్లో సరుకులు విక్రయించకూడదని ఆంక్షలు విధించారని తెలిపారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.25 వేల జరిమానా విధిస్తామని బెదిరించినట్లు పేర్కొన్నారు.వీడీసీ అడిగిన రూ.6 లక్షలు ఇవ్వనందుకే పాత కక్షలను తెరపైకి తెచ్చి ఈ సాంఘిక బహిష్కరణకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. బాధిత కుటుంబాలను గతంలోనూ ఒకసారి బహిష్కరించారని, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని విమర్శించారు. అధికారులు, బీసీ కమిషన్ గ్రామాన్ని సందర్శించినప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రాణ, ఆస్తి రక్షణ కల్పించాలని, వారి జీవనాధారమైన ఈత వనాన్ని కాల్చివేసిన ఘటనకు నష్టపరిహారం చెల్లించాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, నిర్మల్, మెట్‌పల్లి తదితర ప్రాంతాల్లో వీడీసీల పేరుతో జరుగుతున్న సాంఘిక బహిష్కరణలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. వీడీసీలను పూర్తిగా రద్దు చేసేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దసరాకు ఉప్పల్ నుంచే సొంతూళ్లకు

### 30 మంది ప్రయాణికులు ఉంటే కాలనీల వద్దకే ప్రత్యేక బస్సు

### ఉప్పల్ ప్రాంతవాసులు 9959226142 నంబరును సంప్రదించాలి



**ఉప్పల్, అక్టోబర్ 9 (జనం సాక్షి):** దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒకే ప్రాంతానికి చెందిన కనీసం 30 మంది ప్రయాణికులు గ్రూపుగా ముందస్తు బుకింగ్ చేసుకుంటే వారి కాలనీ, నివాస ప్రాంతం లేదా గేటెడ్ కమ్యూనిటీ వద్దకే ప్రత్యేక బస్సును పంపించే ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ఉప్పల్ ప్రాంత ప్రజలు బస్సుల కోసం ప్రధాన బస్టాండ్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ ప్రయాణాన్ని సౌకర్యవంతంగా ప్రారంభించవచ్చు.గ్రూపు బుకింగ్‌తో ప్రత్యేక సదుపాయందసరా సెలవుల సందర్భంగా హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల్లోని స్వస్థలాలకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉద్యోగులు, విద్యార్థులు ఒకే ప్రాంతం నుంచి ఒకే గమ్యస్థానానికి వెళ్లాలనుకుంటే గ్రూపుగా బస్సును బుక్ చేసుకోవచ్చు. కనీసం 30 మంది ప్రయాణికులు ఉంటే సంబంధిత ఆర్టీసీ అధికారులను సంప్రదించి ప్రత్యేక బస్సు సదుపాయాన్ని కోరవచ్చు. ప్రయాణికుల అవసరాలు, బస్సుల లభ్యత ఆధారంగా సేవలను ఏర్పాటు చేయనున్నారు.ఉప్పల్ ప్రయాణికులకు ప్రత్యేక సూచనఉప్పల్,పరిసర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ప్రత్యేక బస్సుల బుకింగ్, ఇతర వివరాల కోసం 9959226142 నంబరును సంప్రదించాలి. ప్రయాణికుల సంఖ్య, వెళ్లాల్సిన ప్రాంతం, ప్రయాణ తేదీ తదితర వివరాలను ముందుగానే తెలియజేయడం ద్వారా బస్సు ఏర్పాట్లపై సమాచారం పొందవచ్చు.ముందస్తు బుకింగ్‌తో ప్రయాణం సులభందసరా పండుగ సమయంలో బస్టాండ్లలో రద్దీ, సామానుతో ప్రయాణం వంటి ఇబ్బందులను తగ్గించేందుకు ఈ సదుపాయం ఉపయోగపడనుంది. ఒకే కాలనీకి చెందిన వారు సమన్వయంతో గ్రూపుగా ఏర్పడి ముందస్తుగా బుకింగ్ చేసుకుంటే తమ ప్రాంతం నుంచే ప్రయాణించే అవకాశం ఉంటుంది. ఉప్పల్ ప్రాంత ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

## బోడుప్పల్‌లో వైభవంగా శ్రీ మాతా నిమిషాంబ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 20 వరకు వేడుకలు

### తొలిసారిగా మాలధారణ దీక్ష ప్రారంభం




**బోడుప్పల్-జనంసాక్షి ::**శ్రీ సోమవంశ క్షత్రియ నకాష్ కులస్తుల కులదేవత శ్రీ మాతా నిమిషాంబ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు బోడుప్పల్‌లో అక్టోబర్ 11 నుంచి 20 వరకు వైభవంగా నిర్వహించనున్నారు.శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం,హంపీ పీఠం ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాలకు ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.అశోక్‌కుమార్ తెలిపారు.ఈ ఏడాది నుంచి తొలిసారిగా శ్రీ మాతా నిమిషాంబ దేవి మాలధారణ దీక్షను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. తొలిరోజు మాలధారణ చేసుకున్న భక్తులు అక్టోబర్ 20న విజయదశమి సందర్భంగా దీక్ష విరమించవచ్చని పేర్కొన్నారు. ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు,సామూహిక చండీ హోమం నిర్వహించనున్నారు.సరస్వతీ దేవి అలంకరణ రోజున విద్యార్థులతో సామూహిక సరస్వతీ హోమం, అన్నపూర్ణ దేవి అలంకరణ రోజున సామూహిక అన్నప్రసాద వితరణ చేపట్టనున్నారు.భక్తులకు ప్రత్యేక సౌకర్యాలునవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీరు, ప్రసాదం ఉచితంగా అందించడంతోపాటు ప్రదక్షిణలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.ఆలయం వద్ద పార్కింగ్ సౌకర్యం పరిమితంగా ఉన్నందున భక్తులు ప్రజా రవాణాను వినియోగించాలని నిర్వాహకులు సూచించారు.మెట్రో రైలులో ఉప్పల్ వరకు చేరుకుని అక్కడి నుంచి ఇతర రవాణా మార్గాల్లో ఆలయానికి రావచ్చన్నారు.ప్రతిరోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఆలయ దర్శనంతోపాటు 16 వెయిల 108 ప్రదక్షిణలు చేసేందుకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.భక్తులందరూ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్,ప్రధాన కార్యదర్శి కె.అశోక్‌కుమార్ కోరారు.

## తెలుగు భాషా వైభవాన్ని చాటుతున్న శ్రీ చైతన్య హైస్కూల్



### తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యం

**బోడుప్పల్-జనంసాక్షి:**తెలుగు భాషా వైభవాన్ని, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో పీర్జాదిగూడలోని శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థుల్లో తెలుగు భాషపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తెలుగు భాష గొప్పతనాన్ని చాటుతూ, విద్యార్థుల్లో మాతృభాషపై మమకారాన్ని పెంపొందించేలా పాఠశాల యాజమాన్యం కృషి చేస్తోంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడంతో పాటు ఉగాది, బోనాలు వంటి పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్నారు. తెలుగు సాహిత్యం, జానపద కళలు, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్నారు.పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల విలువలను తెలుసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. మాతృభాషను గౌరవించడం, తెలుగు సాహిత్యాన్ని ఆదరించడం, మన వారసత్వాన్ని భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక స్పృహను పెంపొందిస్తూ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ సామ అశోక్ రెడ్డి ,వైస్ ప్రిన్సిపాల్ సామ శోభారాణి ,సాయి అభిషేక్ రెడ్డి లు పాల్గొన్నారు.

## పొన్నాల్లో భూ పునఃసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**శామీర్‌పేట, అక్టోబర్ 9(జనం సాక్షి )** శామీర్‌పేట మండల పరిధిలోని పొన్నాల గ్రామంలో కొనసాగుతున్న భూ పునఃసర్వే కార్య క్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజాయేందర్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ పునఃసర్వే పనులను ఎలాంటి తప్పులు లేకుండా, పారదర్శకంగా పూర్తి చేయ్యాలని అధి కారులను ఆదేశించారు. సరి హద్దు వివాదాలు లేకుండా రికార్డులను పక్కాగా నమోదు చేయ్యా లని సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌తో పాటు శామీర్‌పేట తహసీల్దార్ సి హెచ్ శ్రీనివాస్ , మండల సర్వేయర్ మహేందర్ , మండల ఆర్ ఐ భానుచందర్ , గ్రామ పాలన అధికారి ప్రసన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్‌హెచ్‌ఓగా రాజు బాధ్యతల స్వీకరణ



**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 9 (జనం సాక్షి ):**ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఇన్‌స్పెక్టర్ రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అక్టోబర్ 9న మధ్యాహ్నం 2.05 గంటలకు ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.

## రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాలు పంపిణీ



**బొంరాస్ పేట, అక్టోబర్ 9 (జనం సాక్షి):**నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్,ఆయిల్ సీడ్స్ పథకం కింద మండలానికి వచ్చిన 300 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను శుక్రవారం తుంకిమెట్ల రైతు వేదిక భవనంలో ముఖ్య అతిథులుగా వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి, విబిజిరాంజీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్,ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం మండల ఇన్చార్జి వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంజిల్ రెడ్డి,రాంరెడ్డి,మల్లికార్జున్,మల్లేష్,ఏఈవోలు స్వాతి,హేమారెడ్డి, పవన్, సాయి తేజ గౌడ్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం



**అమీర్‌పేట్ (జనం సాక్షి):** ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ అధికారులు, పండితులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించారు. మంత్రితో పాటు దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావును కలిసి ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈఓ వినోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలకు పరిష్కారం

## ఇబ్రహీంపట్నం ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి రాందాస్ పల్లిలో అవగాహన సదస్సు



**రంగారెడ్డి, అక్టోబర్ 9 (జనంసాక్షి)**ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం రాందాస్‌పల్లి గ్రామంలో భూ రికార్డుల రీ సర్వే ప్రక్రియ పై ప్రజలకు అవగాహన సదస్సు వార్డు కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు రీ సర్వే ఉద్దేశ్యం, చేపట్టే దశలు, భూ హద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలను గ్రామస్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాత రికార్డులను నవీకరించడంతో పాటు భూ యజమానులకు స్పష్టమైన హక్కు వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ ధ్రువపత్రాలు, ఆధార్ తదితర అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, సర్వే బృందాలు గ్రామంలో పర్యటించే సమయంలో భూ యజమానులు తప్పనిసరిగా హాజరై తమ భూముల హద్దులను చూపించాలని, పొరుగు భూ యజమానులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పాండురంగారెడ్డి, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ మాధవి, జీపీఓ సుదర్శన్ పాల్గొన్నారు.

## భూ కబ్జాదారులపై చట్ట పరంగా చర్యలు తీసుకొని మాకు న్యాయం చెయ్యాలి



**శామీర్‌పేట, అక్టోబర్ 09 (జనం సాక్షి )** కొందరు రాజకీయ నాయకులు అధికారులను తప్పుదోవ పట్టించి దౌర్జన్యంగా తమ భూమిని కాజేసేందకు కుట్ర పన్నుతున్నారని భాధితులు ఆవేదన చెందుతున్నారు. శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట ప్రెస్ క్లబ్ లో భాధితులు జకముకల హనుమంత రెడ్డి, జకముకల వీరారెడ్డిలు ప్రెస్ మీట్ నిర్వహించారు. మూడు చింతలపల్లి మున్సిపాలిటీ జగన్ గూడ రెవెన్యూ పరిధిలో 1927 నిజాం కాలం నాటి సర్వేలో పేర్కొన్న ప్రకారం తమ పంట పొలాలకు పక్కనే ఉన్న 33 గుంటల భూమిలో మోటబావి, ఒక ఇల్లు ఉందని పేర్కొన్నారు. దీంతో పాటు 1965 సంవత్సరంలో ఇంటి పన్ను, 1967లో మోటర్ లోను, 1971లో విద్యుత్ మీటర్ బిల్లు ఉన్నాయని తెలిపారు. అయితే ఇట్టి స్థలాన్ని 1996లో వారు కొనుగోలు చేశామని తెలిపారు. కొన్ని ఏళ్లుగా గ్రామంలోని కొందరు రాజకీయ నాయకుల కన్ను తమ భూమిపై పడిందని, తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకునేందుకు తమని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారితో ప్రాణహాని పొంచి ఉందని ఆరోపించారు. న్యాయవ్యవస్థ ఉన్నతమైనదని, కోర్టుల చుట్టూ తిరిగి ఆ స్థలం తమదేనని ఆర్డర్స్ తెచ్చుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలంపై భూ కబ్జాదారు లకు ఎలాంటి సంబంధం లేకున్నా అధికారులకు మాయ మాటలు చెప్పి, తప్పుదోవ పట్టించి తమ భూమిని కాజేయాలని ప్రయత్నిస్తున్నారని వివరించారు. తమ భూమిని కాపాడుకునేందుకు ఫెన్సింగ్ కోసం తెచ్చి పెట్టుకున్న రాళ్ల కడీలను తాము లేని సమయంలో అక్కడ ఉన్న బావిలో పడేసి బావిని పూడ్చారని, గుంపులు గుంపులుగా వచ్చి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని వాపోయారు. వారి దౌర్జన్యాన్ని ఎదుర్కోలేక కోర్టులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న తమకు న్యాయం జరగడం లేదని, ఇకనైనా అధికారులు స్పందించి భూ కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేకూర్చాలని కోరారు.

## చేగువేరా విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలి



### కల్లూరు ధర్మేంద్ర

### ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా చేగువేరా 59వ వర్ధంతి

**కాప్రా, అక్టోబర్ 9 (జనం సాక్షి ) :** చేగువేరా విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర అన్నారు. ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్ లో చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ చే గువేరా ఆశయాలను, విప్లవ పోరాట స్ఫూర్తిని యువతరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. విప్లవం అనేది పండిన పండు మాదిరిగా దానంతట అదే చేతికి అందేది కాదని, అన్యాయంపై పోరాడి, ప్రజలను సంఘటితం చేసి, హక్కులను సాధించుకోవాల్సిందేనని చే గువేరా సందేశం స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు . సామ్రాజ్యవాదం, దోపిడీ, అసమానతలు, పేదరికం, నిరుద్యోగం, విద్యా, వైద్య రంగాల్లో పెరుగుతున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యువతరం ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. చేగువేరా జీవితం కేవలం ఒక వ్యక్తి చరిత్ర కాదని, అణగారిన ప్రజల విముక్తి కోసం సాగిన అంతర్జాతీయ పోరాటానికి ప్రతీక అని అన్నారు . నేటి పాలకులు యువతకు ఉపాధి, నాణ్యమైన విద్య, సమాన అవకాశాలు కల్పించడంలో విఫలమవుతున్న నేపథ్యంలో, యువత ప్రశ్నించే గొంతుకగా మారాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ భగత్ సింగ్, చేగువేరా వంటి విప్లవకారుల త్యాగాలు యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని, సామాజిక చైతన్యాన్ని, సమానత్వ భావనను పెంపొందించాలని అన్నారు. విప్లవం కోసం ఎదురుచూడకూడదని.. విప్లవాన్ని పోరాడి సాధించుకోవాలి అనే స్ఫూర్తితో శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం లక్ష్యాల సాధన కోసం యువతరం ముందుకు రావాలని పిలుపునిచ్చారు . దోపిడీ లేని సమాజం, కుల,మత వివక్ష లేని సమాజం, ప్రతి ఒక్కరికీ విద్య,ఉపాధి, గౌరవం అందే సమాజ నిర్మాణమే నిజమైన విప్లవ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల కార్యదర్శి మహేష్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గిరిబాబు, రాజు, సుదర్శన్, ప్రతాప్, నరేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నవీన ఆదర్శ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కొడంగల్, అక్టోబర్ 09(జనం సాక్షి):**కొడంగల్ పట్టణ కేంద్రంలో నవీన ఆదర్శ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినులు తంగేడు, గునుగు, జిల్లేడు, బంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి పాత కొడంగల్ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ నరేశ్ రాజు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ మహిళల్లో ఐక్యతను, ఆనందాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి వేడుకలు దోహదపడతాయని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే రంగారెడ్డిపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల విజయ్



**రంగారెడ్డి, అక్టోబర్ 9 (జనంసాక్షి):** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా వేదికగా నిరాధారమైన, తప్పుడు ప్రచారాలు చేయడం వెంటనే మానుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల విజయ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల స్పందనను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బొంగులూరు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద బస్సెక్కి ఇంజాపూర్ వరకు ప్రయాణించారని తెలిపారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ, ఒక విద్యార్థిని చేయి పట్టుకుని బస్సు ప్రయాణం ఎలా ఉందని ఆరా తీస్తున్న సమయంలో కొందరు పోకిరీలు దీనిని వీడియో తీసి, వక్రీకరించి దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను, ప్రజల నుంచి ఎమ్మెల్యేకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి కుట్రలకు తెరలేపుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఆపకపోతే, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తీవ్రంగా హెచ్చరించారు.

## హన్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

### విద్యార్థినుల ఆటపాటలతో సందడిగా పాఠశాల ప్రాంగణం



**పెద్దేముల్ అక్టోబర్ 09(జనంసాక్షి)** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని హన్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పూల అలంకరణలు, విద్యార్థినుల ఆటపాటలతో సందడిగా మారింది. సాంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సంబురాల్లో పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో హన్మాపూర్ ఉపసర్పంచ్ పంజుగుల మల్లేష్,పంజుగుల నీలమ్మ,పాఠశాల హెచ్ఎం బాల్ రాజ్ ఉపాధ్యాయుడు విజయ కుమార్,గ్రామ పెద్దలు, గ్రామ మహిళలు,విద్యార్థులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడితో బంతి రైతుల కష్టాలు

### ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీటి సరఫరా



**చేవెళ్ల, అక్టోబర్ 09 (జనంసాక్షి)** ఓ వైపు సరైన సమయంలో వర్షాలు కురవకపోవడం.. మరోవైపు విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతికొచ్చే దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో బంతి పూలు సాగు చేస్తున్న రైతులు నీటి ఎద్దడితో సతమతమవుతున్నారు. పంట ఎండిపోతుండటంతో చేసేదిలేక ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి తోటలకు సరఫరా చేస్తున్నారు. పంటను కాపాడుకునేందుకు అదనపు భారం బంతి పూల సాగుపై ఆశలు పెట్టుకున్న రైతులకు ప్రస్తుత పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. తగినంత వర్షపాతం లేకపోవడంతో పొలాల్లో నీటి లభ్యత తగ్గిపోగా, విద్యుత్ కోతలు సాగునీటి సరఫరాకు ఆటంకంగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో పంటకు అవసరమైన సమయంలో నీరు అందక బంతి మొక్కలు వాడిపోతున్నాయి. పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను ఎలాగైనా కాపాడుకోవాలనే ఉద్దేశంతో ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి తోటలకు అందిస్తున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ట్యాంకర్ల నీటి కోసం అదనపు వ్యయం భారంగా మారుతోంది. పంట దిగుబడి తగ్గితే పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. కోతల్లేని విద్యుత్ అందించాలని విజ్ఞప్తి వర్షాభావ పరిస్థితులకు తోడు విద్యుత్ కోతలు తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తంగడపల్లి రైతులు పేర్కొంటున్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ అందుబాటులో లేకపోవడంతో పంటలకు నీరు పెట్టడం కష్టమవుతోందని చెబుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి వ్యవసాయానికి కోతల్లేని విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు. నీటి ఎద్దడి నుంచి రైతులను గట్టెక్కించేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, చేతికొచ్చే దశలో ఉన్న పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కార్మికుల సంక్షేమమే లక్ష్యం. సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం



**శామీర్ పేట్, అక్టోబర్ 9(జనం సాక్షి )**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు శుక్రవారం జరిగిన నేపథ్యంలో హకీంపేట్ ఆర్టీసీ డిపోలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూ యూనియన్) బాణం గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించా లని యూనియన్ నాయకులు కార్మికులకు విజ్ఞప్తి చేశారు.హకీంపేట్ డిపో టీడబ్ల్యూ యూనియన్ గౌరవ అధ్యక్షులు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, డిపో అధ్యక్షులు తులసీరాం, డిపో సెక్రటరీ పవన్ యాదవ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, యూనియన్ ప్రతినిధులు డిపో వద్ద కార్మికులను కలిసి మద్దతు కోరారు.ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు పీఆర్సీ అమలు చేయడంతో పాటు జీతాలు పెంచిందని, పెండింగ్‌లో ఉన్న బాండ్ డబ్బులను చెల్లించిందని పేర్కొన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందని తెలిపారు.రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. బాణం గుర్తుకు ఓటు వేసి టీడబ్ల్యూ యూనియన్‌ను గెలిపిస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడం వంటి లక్ష్యాల సాధన కోసం మరింత బలంగా కృషి చేస్తామని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం అండగా ఉంటుందని పేర్కొన్నారు.డిపో అధ్యక్షులు తులసీరాం, డిపో సెక్రటరీ పవన్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వంలో విలీనం, కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణే టీడబ్ల్యూ యూనియన్ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. కార్మికులంతా ఐక్యంగా బాణం గుర్తుకు ఓటు వేసి యూనియన్ అభ్యర్థులను గెలిపించా లని కోరారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంతం శిరీషా కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వైస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి. బిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ టి. శంకర్ గౌడ్, రామాలయం మాజీ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ డి.సాయిబాబా, కట్ట మైసమ్మ దేవాలయం మాజీ చైర్మన్ ఎం.మహేందర్ యాదవ్ లు పాల్గొన్నారు.

## 20వ శతాబ్దపు నిప్పుకణం, విప్లవ కెరటం “ఎర్నెస్టో చే గువేరా “

### ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి. హరీష్, ఎండీ అన్వర్



**బోడుప్పల్-జనంసాక్షి:** ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక ఉప్పల్ డిపో కార్యాలయం వద్ద చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో , ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా హరీష్ , ఎండీ అన్వర్ మాట్లాడుతూ.... చేగువేరా పేరు వింటేనే నరనరాల్లో చైతన్యం ప్రవహిస్తుంది. యుద్ధానికి సిద్ధమై వెన్నెముక నిటారుగా చేగువేరా అని హృదయం కలవరిస్తుంది. దేహం నలుమూలల అణువణువు నిప్పు రవ్వై వెలిగిపోతుంది.ఎర్నెస్టో చే గువేరా 1928 జూన్ 14 న అర్జెంటీనా దేశంలో రోసారియా పట్టణంలో జన్మించి బ్యూనాస్ ఎయిర్స్ యూనివర్సిటీలో మెడిసిన్ పూర్తి చేసిన అనతి కాలంలోనే లాటిన్ అమెరికా తిరిగి అక్కడున్న ప్రజలందరి బ్రతుకులు మార్చడం కోసం ఏ మెడిసిన్ ఇవ్వగలం అని మదనపడుతున్న తరుణంలో 1955 మెక్సికో క్యూబా ప్రవాస విప్లవకారుడు ఫెడల్ కాస్ట్రోతో పరిచయం ఏర్పడింది. క్యూబా విప్లవంలో డాక్టర్ గా చేరాడు.దోపిడీకి గురవుతున్న ప్రజలకు విప్లవాత్మక మెడిసిన్ అవసరమని భావించి విప్లవకారుడిగా పరిణితి చెంది విప్లవ గెరిల్లా దళానికి నాయకుడయ్యాడు. క్యూబా స్వాతంత్ర్యం కోసం ఆస్థమా వ్యాధిని సైతం లెక్క చేయకుండా చే నిజమైన గెరిల్లా నాయకుడయ్యాడు. 1959 లో ఆవిష్కృతమైన స్వాతంత్ర్య క్యూబాలో చేగువేరా పరిశ్రమల మంత్రిగా, జాతీయ బ్యాంకు అధ్యక్షుడిగా,రక్షణ కేంద్రాల అధిపతిగా, ఆర్థిక, మైత్రి బృందాల సభ్యులుగా ఎన్నో బాధ్యతలను తన 39 ఏండ్ల ప్రాయంలోనే నిర్వహించాడు. 1965 లో క్యూబాని వదిలి ఎన్నో దేశాలను తిరిగాడు. బొలివియా ప్రజలను విముక్తి చేసే బాధ్యతని తన భుజాలపై వేసుకొని కమ్యూనిస్ట్ గెరిల్లా దళాన్ని”స్వయంగా తయారు చేసుకుని విప్లవోద్యమాన్ని నిర్మించి నాయకత్వం వహించాడు. బొలివియా నియంత సైన్యాన్ని గడగడలాడించాడు. ఆ క్రమంలోనే అమెరికా ఆయుధ సంపత్తుఅంత బొలివియా సైన్యానికి మద్దతు పలికి కుట్రపన్ని 1967 అక్టోబర్ 9 న చే ని మట్టుబెట్టడం జరిగింది. ఆయన పోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థి, యువత, “విద్యా, ఉపాధి, ఆర్థిక, సామజిక” అసమానతలపై పోరాటాలు కొనసాగించాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, వెంకటేష్, సన్నీ, సిద్ధార్థ, వినయ్,చరణ్, ప్రవీణ్, మహేష్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువుల యజమానులు తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలి

### వికారాబాద్ జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ సదానందం



**బొంరాస్ పేట,అక్టోబర్ 9(జనం సాక్షి):** తెలంగాణ రాష్ట్ర పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఉచిత పాడి పశువైద్య శిబిరాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సదానందం అన్నారు.శుక్రవారం మండల పరిధిలోని సూర్య నాయక్ తండాలో మండల పశువైద్య అధికారి డాక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరాన్ని స్థానిక సర్పంచ్ హిరు నాయక్ తో కలిసి నట్టల నివారణ మందులు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.పశువులు కలిగిన యజమానులు తప్పనిసరిగా వ్యాధి నివారణకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా వేయించాలన్నారు.పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్ నాయక్, ఎల్ఎస్ఏ జగదీశ్వర్,గోపాలమిత్ర సూపర్వైజర్ కేశవులు,గోపాల మిత్రలు మహేష్ ,విశ్వనాథం, బాలరాజు, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ సమస్యల పరిష్కారానికి కమిషనర్ ఆదేశాలు

### నల్ల చెరువు మీదుగా వరంగల్ హైవేకు రోడ్డు నిర్మాణంపై సమీక్ష



**ఉప్పల్, అక్టోబర్ 9 (జనం సాక్షి):** ఉప్పల్ సర్కిల్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పౌర సమస్యలను పరిష్కరించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.మల్లికార్జున నగర్‌లో రహదారి అభివృద్ధిపై సమీక్షఉప్పల్ పరిధిలోని మల్లికార్జున నగర్‌లో నల్ల చెరువు మీదుగా వరంగల్ హైవేకు అనుసంధానించే ప్రతిపాదిత రహదారి అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి చేపట్టాల్సిన తదుపరి చర్యలపై అధికారులతో సమీక్షించారు. పనుల పురోగతికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు.హైడ్రాతో సమన్వయం చేసుకోవాలని సూచనప్రతిపాదిత రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి హైడ్రాతో అవసరమైన సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. పనుల అమలుకు ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.పౌర సమస్యల పరిష్కారమే లక్ష్యంఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తూ, పౌర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



**ధారూర్ అక్టోబర్ 09(జనం సాక్షి)**తెలంగాణ సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు ధారూర్ మండల పరిధిలోని నాగసముందర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అంబరాన్నంటాయి. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే ఈ ప్రత్యేక పండుగను విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు...ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాండురంగారెడ్డి,ఉపాధ్యాయులు యాదమ్మ, అరుణ,శాంతమ్మ,అరుణ. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపడుచుల ఐక్యతకు బతుకమ్మ ప్రతీక

## కేజీబీవీ పాఠశాల,ఎస్ఓ శ్రీలత ఆప్రాది



నవాబ్ పేట్ అక్టోబర్ 09( జనం సాక్షి)తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు శుక్రవారం నవాబ్ పేట్ మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎస్ఓ, ఆప్రాది శ్రీలత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పాఠశాలలోఉపాధ్యాయులు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను ముస్తాబు చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇందిరా, అనిత, శ్రీలత, వాణి, నిర్మల, సబిత, అనిత, సునీత, సిబ్బంది, విద్యార్థులు కలసికట్టుగా పాల్గొని బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.వేడుకల అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులు పరస్పరం బతుకమ్మ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు

## బీజేపీ కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు ఎర్ర పాండు



మహేశ్వరం,అక్టోబర్ 10(జనంసాక్షి):విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహేశ్వరం మండలం బీజేపీ కిసాన్ మోర్చ అధ్యక్షుడు ఎర్ర పాండు అన్నారు.శుక్రవారం రైతులతో కలిసి మహేశ్వరం విద్యుత్ శాఖ అదనపు సహాయ ఇంజనీర్ భార్గవ్ కు విద్యుత్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎర్ర పాండు మాట్లాడుతూ...విద్యుత్ లో వోల్టేజ్ వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తరచూ ట్రాన్స్ ఫారం సమస్యలు వస్తున్నాయన్నారు.రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని డిమాండ్ చేశారు.రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే రాబోయే రోజుల్లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున రాస్తారోకోలు,ఆందోళనలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్,బుగ్గని దేవేందర్,గుర్రంపల్లి మల్లేష్, జంగయ్య,రవీందర్,రెడ్డి బాలరాజ్,మహేందర్,ప్రవీణ్, జైపాల్ రెడ్డి,బండ బిక్షపతి, సాయినాథ్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్ సముద్ర రంగ అభివృద్ధికి అంతర్జాతీయ భాగస్వామ్యాలు



ఖైరతాబాద్, అక్టోబర్ 09 (జనం సాక్షి) : యువత, మహిళల భాగస్వామ్యం, అంతర్జాతీయ సహకారం తో భారత్ సముద్ర రంగాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రకటించినట్లు ఆ శాఖ కార్యదర్శి విజయ్ కుమార్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. 'సాగరమంథన్-2026'లో భాగంగా సౌదీ అరేబియా, బెల్జియం, భూటాన్ ప్రతినిధులతో ఓడరేవుల పెట్టుబడులు, గ్రీన్ షిప్పింగ్, వాణిజ్య మార్గాలు, నైపుణ్యాభివృద్ధిపై చర్చించారని తెలి పారు. సహాయ మంత్రి శంతను ఠాకూర్ గ్రీస్, లిథు వేనియా, మొజాంబిక్, మయన్మార్ ప్రతినిధులతో పోర్టుల అభివృద్ధి, నౌకల నిర్మాణం, మరమ్మతులు, సముద్ర భద్రతపై చర్చలు జరిపారని చెప్పారు. 2030 నాటికి సముద్ర రంగంలో మహిళల భాగ స్వామ్యాన్ని పెంచేందుకు 'మిషన్ 20 శాతం' లక్ష్యంగా పెట్టుకున్నట్లు సోనోవాల్ వెల్లడించారని తెలిపారు. 2070 నాటికి నెట్ జీరో లక్ష్య సాధనకు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా, మిథనాల్ వినియో గాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

# స్థానిక సమస్యల పరిష్కారానికి పరమేశ్వర్ రెడ్డి హామీ

## డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాల సమస్యలపై వినతులు.. ఉత్సవాలకు ఆహ్వానాలు



ఉప్పల్ అక్టోబర్ 9 (జనం సాక్షి): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్లలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ, అపార్ట్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు పరమేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.వెంకటేశ్వర కాలనీలో డ్రైనేజీ సమస్యపై వినతిఉప్పల్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పరమేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్ఎస్ఎల్ అరీనా అపార్ట్మెంట్స్లో సమస్యలపై వినతిహబ్సిగూడ డివిజన్ పరిధిలోని ఎన్ఎస్ఎల్ అరీనా అపార్ట్మెంట్స్లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని అపార్ట్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పరమేశ్వర్ రెడ్డి, సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానంహబ్సిగూడ డివిజన్ పరిధిలోని వెలుగుగుట్టలో ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ ప్రతినిధులు పరమేశ్వర్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.బతుకమ్మ వేడుకలకు ఆహ్వానంహబ్సిగూడ డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ ఉమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు పరమేశ్వర్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

# గ్రామంలోని సమస్యలు తీర్చడమే నా లక్ష్యం

## గ్రామ సర్పంచ్ దాన నర్సింలు



నవాబుపేట్ అక్టోబర్ 9 (జనం సాక్షి):నవాబుపేట్ మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో గ్రామ ప్రజలకు ఎన్ని సమస్యలు ఉన్నా సర్పంచిగా బాధ్యతలు నిర్వహించిన సందర్భంగా శుక్రవారం గ్రామ ప్రజలకు మునుముందుగా మొట్టమొదటి సమస్య ప్రజలకు ఏది కావాలన్నా ముందుగా కావలసిన త్యాగనానికి నీళ్లు కాబట్టి నేటి సమస్య గత వారం రోజుల నుండి ఉన్న సమస్యను నూతనంగా బోరు వేయించి నీళ్లను గ్రామస్తులకు అందజేయడానికి ముందుకు వచ్చినటువంటి గ్రామ సర్పంచ్ తన సొంత డబ్బులతో బోరు వేయించి మోటారు బిగించి నీటిని తిరవర చేస్తున్న ఘనత సర్పంచి నరసిమ్ములే అని గ్రామస్తులు ఈరోజు ఆనంద ఉత్సవాలలో మునిగిపోయారు తాగడానికి నేను లేక అల్లడిల్లుతున్న గ్రామం సమస్యలు వచ్చిన నీటితో ఎంతో ఇంకా రెండు బోర్లను వేసినట్లయితే గ్రామం ప్రజల సమస్యలు పూర్తిగా తీర్చి దిద్దుతాయని యువజన సంఘాల నాయకులు తెలిపారు. గ్రామంలోని యూత్ సభ్యులుగా ఉండి గ్రామ సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్న తమకు సమాచారం ఇచ్చినట్లయితే గ్రామసభ నిర్వహించి పంచాయతీ వార్డు సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామ సమస్యలు తీర్చి దిద్దుతానని ఆయన తెలిపారు. మంచినీటి సమస్య కొంతమంది ప్రజలకు సరఫరా చేస్తామని అదేవిధంగా ఇంకా కొంత మంది ప్రజలకు గత రెండు మూడు రోజుల్లో ఇంకొక బోరు వేయించి వాడిని కూడా నీళ్లను ప్రజలకు అందే విధంగా ప్రయత్నం చేస్తానని సర్పంచి నర్సింలు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, ఉపసర్పంచి నాగిరెడ్డి పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్తులు సుధాకర్, బుచ్చిరెడ్డి, పాపయ్య అమీర్ ఖాన్, శ్రీనివాస్ రెడ్డి,కృష్ణ, విట్టల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి కృషి చేస్తాం




## టీయూడబ్ల్యూజే--ఐజేయూ కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సలీం పాషా

చేవెళ్ల, అక్టోబర్ 09 (జనంసాక్షి) జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా స్పష్టం చేశారు. జర్నలిస్టులకు అండగా నిలుస్తూ వారి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని వికారాబాద్ రోడ్డులో ఉన్న జీబీఆర్ ఫామ్హౌస్లో నిర్వహించిన సమావేశంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ చేవెళ్ల నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, సలీం పాషా మాట్లాడుతూ.. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్ కార్డులు కల్పించడంతోపాటు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించేందుకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. నూతన కార్యవర్గం ఐక్యంగా పనిచేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. నూతన కార్యవర్గం ఎన్నిక చేవెళ్ల నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా పడమటి నరేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గోంగుపల్లి రాఘవేందర్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కార్యదర్శులుగా వామన్ రెడ్డి, శ్రీకాంత్, కోశాధికారిగా ఈపూరి రాఘవేంద్ర ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఇస్మాయిల్, రమేష్, శివ, సుధాకర్, శివారెడ్డి, ముస్తఫా, బిక్షపతి ఎంపికయ్యారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సంతోష్, జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడిగా మల్లేష్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పడమటి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన యూనియన్ నాయకులకు, జర్నలిస్టు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరినీ కలుపుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీశైలం, టీయూడబ్ల్యూజే చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు యాదయ్య, కార్యదర్శి గోపాల్, షాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధర్మపల్లి రవీందర్ గౌడ్, జిల్లా నాయకులు కరుణాకర్ చారి, దర్శనాల కృష్ణ, సంతోష్ కుమార్ చారి, మల్లేష్ గోపాల్ రావు, వికారాబాద్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు కుమ్మరి రాఘవేందర్, వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. చేవెళ్ల నియోజకవర్గ రిపోర్టర్లు పూర్ణచందర్, రాజేష్, చంద్రశేఖర్, వినయ్తో పాటు పలువురు జర్నలిస్టులు హాజరయ్యారు.



## పిక్సెల్లెన్స్ 6వ వార్షికోత్సవం

**అంకితభావం, సృజనాత్మకతే విజయ రహస్యం**

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రముఖ క్రియేటివ్ అండ్ ప్రొడక్షన్ సంస్థ పిక్సెల్లెన్స్ విజయవంతంగా 6వ వసంతంలోకి అడుగుపెట్టింది. గత ఆరేళ్లుగా సంస్థ కనబరుస్తున్న అంకితభావం, వినూత్న సృజనాత్మకత. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు ఈ మైలురాయిని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు గోవింద్, విశాల్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు మాట్లాడుతూ.. "గత ఆరేళ్లుగా మా బృందం ప్రదర్శించిన అంకితభావం, సృజనాత్మక ఆలోచనలు, నాణ్యమైన పనితీరుతో సాధించిన ఈ మైలురాయి మాకెంతో గర్వకారణం, స్ఫూర్తిదాయకం. పిక్సెల్లెన్స్ 6వ వార్షికోత్సవం సందర్భంగా మా సంస్థ ప్రతినిధులకు, ఉద్యోగులకు, మాపై నమ్మకం ఉంచిన క్లయింట్లకు హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు. భవిష్యత్తులో మరింత సాంకేతికతను, వైవిధ్యాన్ని జోడించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మేము నిరంతరం కృషి చేస్తాము" అని పేర్కొన్నారు. నాణ్యత, సమయపాలన, వినూత్న కాన్సెప్ట్‌లతో పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన పిక్సెల్లెన్స్, రాబోయే రోజుల్లో మరిన్ని నూతన సేవలను విస్తరించనున్నట్లు సంస్థ యాజమాన్యం వెల్లడించింది.



# రంగుల రమణీయం.. దసరా సంబురం

- **న్యూఇరా విద్యాసంస్థలో అంబరాన్నంటిన వేడుకలు**
- **బతుకమ్మ ఆటపాటలు.. సాంప్రదాయ నృత్యాలతో సందడి**

ఖమ్మం (జనంసాక్షి) : రంగురంగుల పూల బతుకమ్మలు.. లయబద్ధమైన చప్పట్లు.. శ్రీరాముని విజయగాథను కళ్లకు కట్టిన ప్రదర్శనలతో స్థానిక మమత హాస్పిటల్ రోడ్డు, రాధాకృష్ణ నగర్‌లోని 'న్యూఇరా హైస్కూల్' ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. పాఠశాలలో దసరా పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. సంప్రదాయ వస్త్రధారణలో హాజరైన విద్యార్థుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

**చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక : చైర్మన్ ఐ.వి. రమణారావు**

ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల చైర్మన్ ఐ.వి. రమణారావు విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాలు, వాహన పూజ, రావణాసుర దహనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అన్నారు. రావణ సంహార ఘట్టం ద్వారా సమాజంలోని అహంకారం, దురాశ, అసూయ, ద్వేషం వంటి అవలక్షణాలను విడిచిపెట్టి సత్యం, ధర్మం, సన్మార్గంలో నడవాలనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. న్యూఇరా విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతూ పాఠశాలకు వన్నె తెస్తున్నారని తెలిపారు. విద్యార్థుల్లోని నిగూఢ ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.




**సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో పాఠశాలల పాత్ర కీలకం: డైరెక్టర్ డా. పి. భూమేశ్వర్రావు**

పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వర్రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఐకమత్య భావనను పెంపొందించడంలో ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. భావితరాలకు మన సనాతన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను చేరవేయడంలో విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




**ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు**

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పాటలకు విద్యార్థినులు లయబద్ధంగా ఆడిపాడగా, శ్రీరాముని విజయగాథను ప్రతిబింబించే నాటికలు, సంప్రదాయ నృత్యాలు అందరినీ కట్టిపడేశాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఉత్సవంతో పాఠశాల ప్రాంగణమంతా విజయదశమి పండుగ ఉత్సాహంతో మురిసిపోయింది.

## బతుకమ్మ, దసరా పండుగల ఏర్పాట్లపై
# జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష

**తార్నాక డివిజన్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగ ఏర్పాట్లు చేపట్టాలి**

**మాజీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి**

సికింద్రాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా తార్నాక డివిజన్‌లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతె శ్రీలత శోభన్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యుడు శ్రీ మోతె శోభన్ రెడ్డితో కలిసి ఆమె జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తార్నాక డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బతుకమ్మ పండుగ నిర్వహణ కోసం అవసరమైన బతుకమ్మ పాండ్లు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే పండుగల సందర్భంగా వీధి దీపాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, రహదారుల పరిశుభ్రత, చెత్త తొలగింపు, డ్రైనేజీ సమస్యల



పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బతుకమ్మ నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. పండుగల సమయంలో పారిశుద్ధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆమె సూచించారు. ప్రజల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పండుగ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, బతుకమ్మ, దసరా పండుగలు తార్నాక డివిజన్‌లో ప్రశాంతంగా, ఆనందోత్సాహాల మధ్య జరిగేలా చర్యలు తీసుకోవాలని మోతె శ్రీలత శోభన్ రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

## వేంకటేశుని దివ్య మందిర భూమిపూజకు రారండి

**42వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించిన మాజీ కార్పొరేటర్ విజయనిర్మల**



ఖమ్మం, (జనంసాక్షి) : ఖమ్మం నగర ప్రజల చిరకాల స్వప్నం సాకారం కాబోతోంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య మందిర శంకుస్థాపన మహోత్సవానికి రంగం సిద్ధమైంది. ఈ చరిత్రాత్మక ఘట్టానికి భక్తులను ఆహ్వానిస్తూ 42వ డివిజన్‌లో గురువారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మాజీ కార్పొరేటర్ పాకలపాటి విజయనిర్మల శేషగిరి ఆధ్వర్యంలో నాయకులు డివిజన్‌లోని ప్రతి ఇంటి గడప తొక్కి కాలనీవాసులను కుటుంబ సమేతంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాకలపాటి విజయనిర్మల మాట్లాడుతూ.. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, త్రిదండి రామానుజ జీయర్ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామివారి దివ్య మార్గదర్శకత్వంలో, వేద మంత్రోచ్ఛారణల నడుమ ఈ నెల 12వ తేదీ (సోమవారం) ఉదయం 9:30 గంటలకు భూమిపూజ కార్యక్రమం వైభవంగా జరగనుందని తెలిపారు. ఖమ్మం చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఈ పవిత్ర మహోత్సవానికి నగరవాసులు, భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీనివాసుని కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే ఈ దివ్య మందిర నిర్మాణం పరిపూర్ణమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఆహ్వాన పత్రికలు అందజేసిన వారిలో డివిజన్ అధ్యక్షుడు గౌస్, షాదీఖానా డైరెక్టర్ సమద్ భాయ్, ముఖ్య నాయకులు రమాదేవి, పర్వీన్, వెంకటరమణ, షహీన్, షమీం తదితరులు ఉన్నారు.

# పేదలకు విద్య, వైద్యం ప్రాధాన్యం

వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. లేబర్ రూమ్‌లను మెరుగుపరచాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా పవర్ బ్యాకప్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో వైద్యుల కొరత ఉంటే తాత్కాలిక నియామకాలకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తూ అంబులెన్స్‌ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

**అంగన్‌వాడీల్లో వసతులు మెరుగుపరచాలి**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార నాణ్యతపై వస్తున్న ఫిర్యాదులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. తగిన వసతులు లేని కేంద్రాలను సమీపంలోని కమ్యూనిటీ హాళ్లకు తరలించే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. మహిళలు, పిల్లలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సీఎస్ఆర్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

**ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు**

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఈటల రాజేందర్ సూచించారు. ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్ వేసి, అవసరమైన చోట ప్రహరీలు నిర్మించాలని చెప్పారు. ఆయా స్థలాలను పిల్లల పార్కులు, కమ్యూనిటీ హాళ్లుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పార్కుల భూములు కబ్జాకు గురికాకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను పేదలకు ఉపాధి కల్పించే కూరగాయల మార్కెట్లు, చిన్న దుకాణాల కోసం వినియోగించాలని, వేలం వేసే ప్రయత్నాలు చేయకూడదని సూచించారు.

**మౌలిక సదుపాయాలపై దృష్టి**

జనాభా పెరుగుదలకు అనుగుణంగా స్టార్మ్‌వాటర్ డ్రైనేజీలు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల




సముదాయాల్లో తాగునీరు, సీసీ కెమెరాలు తదితర సదుపాయాలు కల్పించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. వారపు సంతలు, రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారుల సమస్యలను ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు. ఫైర్ స్టేషన్ల పనితీరును మెరుగుపరిచి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు.

**రైల్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి**

రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబీ), రైల్వే అండర్ బ్రిడ్జిల (ఆర్‌యూబీ) పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రైల్వే అధికారులను కోరారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, బియ్యం పంపిణీలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీల్లో విలీనమైన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

విద్య, జాతీయ రహదారులు, పోస్టల్, మైనింగ్, ఉపాధి తదితర రంగాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు తెలిపారు. అవసరమైన అంశాలపై జిల్లా కలెక్టర్‌తో సమన్వయ సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, దిశ కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌కు చెక్.. స్టీల్ ప్లేట్లే బెస్ట్!

**చేవెళ్ల, అక్టోబర్ 09 (జనంసాక్షి)** ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చేవెళ్లకు చెందిన 8వ తరగతి విద్యార్థిని, ఎర్త్ లీడర్ జి. లక్ష్మీ తేజ వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. పట్టణంలో జరిగే శుభకార్యాలు, విందులు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగాన్ని తగ్గించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం చేవెళ్లలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా లక్ష్మీ తేజ మాట్లాడుతూ.. వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ ప్లేట్లలో వడ్డించడం, వినియోగించిన ప్లేట్లను ఎక్కడపడితే అక్కడ పడేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని వివరించింది. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల విషపూరిత పొగతో వాయు కాలుష్యం ఏర్పడటమే కాకుండా, రోడ్లపై పడేసిన ప్లాస్టిక్‌ను తిని మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ సమస్యకు పరిష్కారంగా చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ప్రజలు శుభకార్యాలు, ఇతర వేడుకలు నిర్వహించేటప్పుడు మున్సిపాలిటీ నుంచి తక్కువ అద్దెకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు తీసుకుని, కార్యక్రమం అనంతరం శుభ్రం చేసి తిరిగి అప్పగించే విధానాన్ని అమలు చేయాలని కోరింది. దీనివల్ల ప్లాస్టిక్ వినియోగం తగ్గడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని, మున్సిపాలిటీకి కూడా ఆదాయ వనరుగా మారుతుందని వివరించింది. సీజీఆర్ పర్యావరణ సంస్థ స్ఫూర్తితో, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.అర్జానా, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఆలోచనకు రూపకల్పన చేసినట్లు లక్ష్మీ తేజ తెలిపింది. విద్యార్థిని ప్రతిపాదనపై స్పందించిన చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై ఇంత గొప్ప ఆలోచన చేయడం అభినందనీయమని ప్రశంసించారు. 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటుపై సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.అర్జానా, మెంటర్ టీచర్ డా.మహేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు షాహీన, తండభాని, మల్లేష్, చేవెళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ రాము గౌడ్, వార్డు కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, తాళ్ళపల్లి నర్సింహులు, ఎర్త్ లీడర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**దుర్గామాత విగ్రహాల నిర్వాహకులతో జోనల్ స్థాయి ...**

నిర్వహణలో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ భద్రత, భక్తుల రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. నిర్వాహకులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి, అవసరమైన సూచనలు చేశారు. నవరాత్రి, దసరా ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

# వైద్యానికి రూ.75 వేల ఆర్థిక సాయం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో ఎల్ఓసీ మంజూరు
- బాధితురాల కుటుంబానికి చెక్కు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

**కీసర, అక్టోబర్ 09 (జనంసాక్షి) :** అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు అండగా నిలిచేందుకు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సహకారం అందించారు.



నాగారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీకి చెందిన బానోత్ అనిత నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో ఎల్ఓసీ ద్వారా రూ.75 వేల ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు శుక్రవారం రూ.75 వేల విలువైన చెక్కును మాజీ కౌన్సిలర్లు అన్నంరాజు లావణ్య శ్రీనివాస్, కౌకుట్ల అనంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్ తో కలిసి బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సదల బిక్షపతి, మాజీ అధ్యక్షుడు సదల అశోక్ పాల్గొన్నారు.

**దేవీ నవరాత్రి ఉత్సవాలపై పోలీసుల సమన్వయ సమావేశం**

**అమీర్‌పేట్ (జనంసాక్షి):** దేవీ నవరాత్రిలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉత్సవాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జూబ్లీహిల్స్ డీసీపీ ఏ. రమణారెడ్డి, ఎస్ఆర్ నగర్ ఏసీపీ రాఘవేందర్‌రావు హాజరయ్యారు. ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, నిర్వాహకులతో చర్చించినట్లు తెలిసింది.

# మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు

**బొంరాస్ పేట, అక్టోబర్ 9 (జనంసాక్షి):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా బొంరాస్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏర్పుమళ్ళ,బురాన్ పూర్,భోజన్నగడ్డతండా, తుంకిమెట్ల, మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల,రెయిన్ బో పాఠశాల, నాందార్ పూర్ గార్గి విద్యా నికేతన్ తదితర పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను



ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు రంగురంగుల పూలతో రకరకాల బతుకమ్మలను తెరిచి పాఠశాలకు తీసుకువచ్చారు.అనంతరం ఆయ పాఠశాలల ఆవరణంలో పూల బతుకమ్మలను ఉంచి అందరితో కలిసి బతకమ్మ పాటలు పాడుతూ, కోలాటం ఆటలు ఆడుతూ సందడి చేశారు.ఆయా పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలలో జిహెచ్ఎం హరిలాల్, వెంకట్ రెడ్డి,విజయలక్ష్మి,భద్రయ్య, ఏర్పుమళ్ళ గ్రామ సర్పంచ్ బందేయ్య,ఉప సర్పంచ్ తిరుపతయ్య,ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య,ప్రశాంత్ కుమార్,చంద్రశేఖర్,లక్ష్మీకాంతరావు, నర్సింలు హరికాంత్, సర్దార్ ,ప్రశాంత్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపల్ రోజా రాణి, అధ్యాపకులు, ఏబీవీపి నాయకులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన సామ రామ్మోహన్ రెడ్డి

రాజేంద్రనగర్,అక్టోబర్9(జనం సాక్షి) మహబూబ్‌నగర్ రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి శుక్రవారం ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపి, రాజేంద్రనగర్ నియోజకవర్గ పట్టభద్రుల ఓట్లు తనకు వచ్చేలా సహకరించాలని కోరారు.

# కాంగ్రెస్ సర్కార్‌కు కరెంటియ్యడం చేతకావడంలే

**బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు**

నవాబ్ పేట్ అక్టోబర్ 09(జనంసాక్షి):కాంగ్రెస్ సర్కార్‌కు కరెంటియ్యడం కూడా చేతకావడం లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దయాకర్ రెడ్డిమండిపడ్డారు. శుక్రవారం ఆయన జనంసాక్షి దినపత్రికతో మాట్లాడారు ఓ వైపు వర్షాలు లేక.. మరోవైపు కరెంట్ ఇయ్యకపోతే పంటలు ఎట్లా పండుతాయని ప్రశ్నించారు. పంటలు చేతికొచ్చే టైమ్‌లో కరెంట్ కోతలేంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు.అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మెడకు ఉరితాడుగా మారిందని విమర్శించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందింది.దీంతో రాత్రింబవళ్లు మోటర్లు నడుపుకొనే అవకాశం లభించింది.రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని రైతులు ప్రశ్నించారు.ప్రస్తుత ప్రభుత్వం ఆరు గంటలు కూడా సరఫరా చేయడం లేదని మండిపడ్డారు.మొత్తంగా కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే విద్యుదుత్పత్తి తగ్గడానికి ప్రధాన కారణమని విమర్శలు చేశారు.ప్రభుత్వం యాసంగి పంటలకైనా 24 గంటల కరెంటు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నవాబ్ పేట్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చెప్పటడం జరుగుతుందని హెచ్చరించారు.

# మురళి కార్తీక్ కుటుంబానికి అండగా ఉంటాం

- **మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**
- **రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి బాధాకరం**
- **కుటుంబ సభ్యులను పరామర్శ**



**కీసర, అక్టోబర్ 09 (జనంసాక్షి)**

రోడ్డు ప్రమాదంలో మురళి కార్తీక్ మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం బండ్లగూడ రామలింగేశ్వర కాలనీలోని మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుషాయిగూడ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్లోని బండ్లగూడ రామలింగేశ్వర కాలనీకి చెందిన పబ్బోజు మురళి కార్తీక్ మృతి చెందడం బాధాకరమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మృతుడి తండ్రి విజయేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మురళి కార్తీక్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, కీసర డివిజన్ అధ్యక్షుడు బాలరాజు యాదవ్, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షుడు తోట నరేష్, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు